క్లుప్తంగా

రిజిస్ట్రార్‌కు అభినందన



రిజిస్ట్రార్ స్టీఫెన్‌ను అభినందిస్తున్న కులిడి సురేష్‌బాబు

బీచ్ రోడ్డు: ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఇటీవలే నియమితులైన జెమ్స్ స్టీఫెన్‌ను డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్ బాబు అభినందించారు. శుక్రవారం రిజిస్ట్రార్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. ఏయూ పేరు ప్రఖ్యాతలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలా సేవలందించాలని సురేష్‌బాబు కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్యకు తక్షణ సహాయం అందిస్తున్న సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ బీమా వర్తించింది. ఈ మేర కు ఆ కుటుంబానికి సచివాలయం సిబ్బంది తక్షణ సహాయం అందించారు. దుర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి ఈ నెల 7న జాతీయ రహదారిపై డెయిరీ ఫారం వద్ద జరిగి న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించింది. ఒకటో నంబరు సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి రామలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను కలిశారు. అప్పలాచారి భార్య జ్యోతికి తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు. మిగతా నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారని తెలిపారు.

బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు



ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా స్టాళ్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో శనివారం ఉదయం నుంచి బాణసంచా విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయినట్లు దుకాణాల నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ 50 వరకు దుకాణాలను సిద్ధం చేశారు. నేరుగా వినియోగదారులు మైదానం మధ్యలో వాహనాలు పార్కింగ్ చేసుకొని విక్రయాలు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

దోమల నివారణ మందు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో దోమల నివారణ కోసం జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం మెగా ఫాగింగ్ నిర్వహించారు. రామ్‌నగర్, కైలేష్‌మెట్ట, నెహ్రూనగర్, పితాని వీధి ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు.

నేడు డయల్ యువర్ మద్దిలపాలెం డీఎం

మద్దిలపాలెం : ఆర్టీసీ మద్దిలపాలెం డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమా న్ని నిర్వహించనున్నామని డిపో మేనేజర్ ఎస్.అరుణకుమారి తెలిపారు. ప్రయాణికులు తమ ఇబ్బందులు, సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 25597 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆమె సూచించారు.



సందర్శకులు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన ట్రీబెంచ్



ఫ్లెస్ ఆకారంలో ఏర్పాటు చేసిన ఇంటర్ లాకింగ్ టైల్స్

ఆహ్లాదకరంగా.. థీమ్ పార్కు

- శరవేగంగా సెక్టార్–11లో పార్కు పనులు
- చిల్డ్రన్ ప్లే ఏరియా, వ్యాయామం, షెటిల్ కోర్టుల నిర్మాణం



గతంలో పిచ్చిమొక్కలతో పార్కు పరిస్థితి ఇలా..



అధునాతన చిల్డ్రన్ ప్లే ఏరియా



అధునాతన ఓపెన్ వ్యాయామశాల

ఎంవీపీ కాలనీ: నగరంలోని పార్కుల ఆధునికీకరణ పనులు జీవీఎంసీ శరవేగంగా చేపడుతోంది. మరో వైపు థీమ్ పార్కుల పేరుతో పలు పార్కులకు కొత్త సొబగులు అద్దుతోంది. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోని పలు పార్కులకు కొత్త శోభ తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని పార్కును థీమ్ పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు. జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలు శరవేగంగా జరుగుతున్న ఆయా పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. కాలనీ వాసులకు పూర్తి ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా ఈ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఇందుకు అనుగుణంగా పార్కులు భారీ ఎత్తున సౌకర్యాలు కల్పిస్తున్నారు. రూ.112 లక్షలతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు.

ఆకర్షణీయంగా.. సౌకర్యాలు..

ఆధునికీకరణలో భాగంగా పార్కులో సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేశారు. పిల్లల నుంచి పెద్దలు, వృద్ధుల వరకు అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా ఈ థీమ్ పార్కులో సౌకర్యాలు కల్పించారు. అన్ని వయసుల వారికి ఉపయోగకరంగా ఉండే విధంగా ఓపెన్ వ్యాయామశాల, షటిల్ కోర్టు, ముగ్గం ట్రాక్, ఆహ్లాదకరంగా ఇంటర్ లాకింగ్ టైల్స్, సందర్శకులకు సేద తీరేందుకు భారీ వృక్షం చుట్టూ ఏర్పాటు చేసిన అధునాతన ట్రీబెంచ్ ఆకట్టుకుంటున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ హాల్ ఆధునికీకరణ, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన అధునాతన చిల్డ్రన్ ప్లే ఏరియాతో పాటు డెకరేటివ్ లైటింగ్ పోల్స్, గ్రిల్‌తో కూడిన కాంపౌండ్ వాల్ వంటి సౌకర్యాలతో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇంజినీరింగ్ విభాగం చేపట్టిన పనులు పూర్తయిన అనంతరం హార్టికల్చర్ విభాగం పార్కును గ్రీనరీతో తీర్చిదిద్దనుంది. మరో రెండు వారాల్లో ఆధునికీకరణ పనులు పూర్తి కానున్నట్లు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. థీమ్ పార్కు నిర్మాణంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ సమాచారం..

‘పర్యావరణ హితంగా దీపావళి’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: పర్యావరణ హితంగా దీపావళి పండగ జరుపుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో గ్రీన్ దివాళి పోస్టర్ ను విద్యా విభాగం విద్యార్థులతో కలసి ఆయన ఆవిష్కరించారు. పర్యావరణహితంగా పండగలను నిర్వహించాల్సిన ప్రాధాన్యతను తెలియజేసే విధంగా పోస్టర్లతో విద్యార్థులు అవగాహన కల్పించడంపై వీసీ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల దీర్ఘకాలిక సమస్యకు సత్వర పరిష్కారం



అధికారులు, ప్రిన్సిపాళ్లతో చర్చిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల విద్యార్థుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు మధ్యలో వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో ఒక సంవత్సరం విద్యకు దూరమవుతున్నారు. తరువాతి కాలంలో తిరిగి ప్రవేశం పొందడం డిగ్రీ పూర్తి చేస్తారు. అయితే తొలుత ప్రవేశం పొందిన సమయంలో ఉన్న సిలబస్, రెండో పర్యాయం ప్రవేశం పొందినప్పుడు ఉన్న సిలబస్‌లో వ్యత్యాసం ఉండడంతో విద్యార్థికి సర్టిఫికెట్ జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య కొద్దిరోజుల క్రితం రిజిస్ట్రార్ దృష్టికి వచ్చింది. దీనిని పరిశీలించిన అనంతరం ఏయూ పరీక్షల విభాగం డీన్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బీవోఎస్ చైర్మన్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారంతా సుదీర్ఘంగా చర్చించి పలు పరిష్కారాలను సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం అందరూ సుదీర్ఘంగా చర్చించి నూతన విధానాన్ని రూపకల్పన చేశారు. దీనిని అకడమిక్ సెనేట్ సమావేశంలో ఆమోదించి విద్యార్థులకు మేలు చేసేలా నూతన విధానాన్ని అమలు చేస్తారు. మధ్యలో చదువు ఆపివేసి తిరిగి చదువుకుని డిగ్రీ పూర్తి చేసే వందలాది మంది విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా నిలవనుంది.

సర్వత్రా హర్షం

అధికారులు ఈ దిశగా ఆలోచన చేయడంపై అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్‌లు సైతం హర్షం వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానం(ఎన్ఈపీ–2020)లో మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ పద్ధతి అమలవుతోంది. ప్రస్తుతం ఏయూ అధికారులు రూపొందించే నూతన పాలసీ ఎన్ఈపీకి సైతం అమలు చేయడానికి ఉపయుక్తంగా ఉంటుంది. ఈ వేశంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, పీజీ పరీక్షల డీన్ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి, డాక్టర్ వి.ఎస్.కృష్ణ, ఏవీఎన్, ప్రభుత్వ మహిళా కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మూడో అంతస్తుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

మద్యం మత్తులో ఘటన

ఎంవీపీకాలనీ: మూడో అంతస్తుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఎంవీపీకాలనీలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన సంబంగి నాగభూషణం(58) విశాఖలో ఉంటూ పలుచోట్ల సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తించాడు. చివరగా ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని అమ్మ బాయ్స్ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేశాడు. మద్యం సేవిస్తుండటంతో పాటు ప్రవర్తన బాగోలేదని హాస్టల్ నిర్వాహకులు గతంలో ఆయన్ని విధుల నుంచి తొలగించారు. దీంతో గత నెల 10న నాగభూషణం సొంతూరు వెళ్లిపోయాడు. కాగా.. నాగభూషణం తన తండ్రిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎంవీపీకాలనీలోని క్యాన్సర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఆయన గతంలో తాను పనిచేసిన అమ్మ బాయ్స్ హాస్టల్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12.30 సమయంలో వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్నాడు. 3వ అంతస్తులో ఐరన్ రైలింగ్‌కు ఆనుకుని నిల్చొన్నాడు. ప్రమాదవశాత్తూ రైలింగ్ విరిగిపోవడంతో కింద పడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంజీవరావు, ఎస్ఐ శ్రీను అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ వైఎస్ జగన్ అవసరం



13వ వార్డులో జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో శుక్రవారం ‘ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే’ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గాబజార్ సమీపం రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ సునీత మాట్లాడారు. ముందుగా వారంతా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించా రు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వాటి వల్ల రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఎంతైనా అవసరం ఉందని చెప్పారు. జగనన్న అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ కానుక, జగనన్న గోరు ముద్ద నుంచి పంటల బీమా, వైఎస్సార్ మత్స్యకార బీమాతో పాటు వైఎస్సార్ చేయూత, పెన్షన్ కానుక, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కంటి వెలుగు, ఇంటింటికి రేషన్ తదితర పథకాల అమలుతో సీఎం వైఎస్ జగన్ అందరికీ చేరువయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, అటవీ శాఖ డైరెక్టర్ వనము వరలక్ష్మి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వానపల్లి ఈశ్వరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, శిరీషా, ఆర్.ఎస్ నాయుడు, జ్యోతి, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



12వ వార్డులో వైఎస్ జగన్ అవసరం గురించి ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రోహిణి

12వ వార్డులో..

జీవీఎంసీ 12వ వార్డులో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలసి నెహ్రూనగర్‌లో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలో వివరించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, మోహన్, శ్రీను, అర్జున్ పాల్గొన్నారు.

కాశీ రైలు కంచికేనా..?

- అట్టహాసంగా ప్రారంభించారు.. పొడిగింపు మరిచారు
- ఇప్పటికీ పట్టాలెక్కని మరో రైలు

తాటిచెట్లపాలెం: ఈ ఏడాది ఏప్రిల్ వరకు కాశీకి రైలు లేదని ఉత్తరాంధ్ర వాసులు బాధపడేవారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో కాశీకి వీక్లీ స్పెషల్ రైలు మంజూరై పట్టాలెక్కింది. విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం(08588/08587) వీక్లీ స్పెషల్ రైలుగా విశాఖ నుంచి ప్రతీ బుధవారం బయలుదేరేది. అది కాస్తా వివిధ కారణాలతో మధ్యలో కొన్ని రోజులు నడిచేది, కొన్ని రోజులు రద్దయ్యేది. ఇది ప్రత్యేక రైలు కావడంతో దీని కాలపరిమితి అక్టోబర్ 26తో ముగియడంతో పూర్తిగా నడవడం లేదు. ప్రస్తుతం కాశీ రైలు లేదు. ఇప్పటివరకు పొడిగింపు రాలేదు. భవిష్యత్తులో ఈ ట్రైన్ ఉంటుందా.. ఉండదా అని ప్రయాణికుల్లో, ఉత్తరాంధ్ర వాసుల్లో ఒకటే ఆందోళన. ఈ రైలు ద్వారా డైరెక్టుగా కాశీకి చేరుకునే ప్రయాణికులు ఎంతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని సాగించేవారు. ఇది కాస్తా లేకపోవడంతో మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయి.

ఇలాగే మరో రైలు కథ..

వారణాసి–సంబల్‌పూర్–వారణాసి(18312/18311) రైలును విశాఖపట్నం వరకు పొడిగిస్తున్నట్లు స్వయానా రైల్వే మంత్రి సెప్టెంబర్ 25న ప్రకటించడం, ఆయనకు జేజేలు పలకడం జరిగాయి ఈ ప్రకటన చేసి సుమారు నెలన్నర కావస్తున్నా.. దీనిపై ఎటువంటి చర్యలు లేవు. ఇది ఎప్పుడు పట్టాలెక్కుతుందో.. విశాఖ వాసులు ఆశలు తీరేదెప్పుడో తెలియని పరిస్థితి. విశాఖపట్నం నుంచి వారణాసికి రెండు రైళ్లని మురిసిపోయాం. కానీ ఆ ఆనందం కేవలం కొద్ది రోజుల్లోనే ఆవిరైంది. సంబంధిత అధికారులు స్పందించి విశాఖ నుంచి నడిచే వీక్లీ స్పెషల్ రైలును కొనసాగించాలని, సంబల్‌పూర్ రైలును కూడా విశాఖ వరకు పొడిగించి వెంటనే పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర, విశాఖ వాసులు కోరుతున్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి ‘సత్యసాయి’విద్యార్థుల వితరణ



ఆశ్రమం విద్యార్థులతో కూర్చొని ఆడుకుంటున్న సత్యసాయి విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో అనాథ పిల్లలకు ఎంవీపీ కాలనీ శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు సహకారం అందించారు. ఈ నెల 23న సత్యసాయిబాబా జయంతి వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు నిత్యావసర సరకులు సేకరించి పేదలకు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో అనాథ పిల్లలకు శ్రీసత్యసాయి విద్యా విహార్ పదో తరగతి విద్యార్థులు సరకులు అందజేశారు. బియ్యం, పండ్లు, బిస్కెట్లు, బెన్‌లు, కేకులు, ఆట పరికరాలు, దుప్పట్లు, పౌడర్ టిన్‌లు, బెడ్‌షీట్లు, నోట్ బుక్స్ తదితర సామగ్రి అందించారు. అనంతరం ఆశ్రమంలో పిల్లలతో విద్యార్థులు కొంత సేపు కలసి ఆడుకొని సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆనంద్ మార్గ్ ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద అవధూత పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలి

ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్



ప్రసంగిస్తున్న ఆచార్య చంద్రశేఖర్

ఏయూక్యాంపస్: సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా యువత ఎదగాలని ఐఐఎం– విశాఖపట్నం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబి) బీబీఏ–ఎంబీఏ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకంగా ఆలోచన చేసే యువతలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో పెట్టే వ్యవస్థ ఏయూలో అందుబాటులో ఉందన్నారు. ఏయూలో నెలకొల్పిన ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నూతన బ్యాచ్‌లో 35 దేశాలకు చెందిన విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంబీఏ– హెచ్.ఆర్ కోర్సును సైతం ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఏయూ సిబిని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా మార్పు చేస్తామన్నారు. విహాన్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ ఎస్‌వెంకట రెడ్డి మాట్లాడుతూ లీడర్‌షిప్, టెక్నాలజీ, ఎంటర్‌ప్యూనర్‌షిప్ భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ సారబంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: 67వ రాష్ట్ర అంతర్ జిల్లాల ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ షట్లర్లు బాలప్రణయ్, అపర్ణ సెమీస్‌కు చేరుకున్నారు. అండర్–14 కేటగిరీలో బాలుర విభాగంలో చిత్తూరుకు చెందిన వేదవ్యాస్, బాలికల విభాగంలో అనంతపురానికి చెందిన నక్షత్ర సెమీస్‌లో ప్రవేశించారు. ఇక్కడి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వ్యక్తిగత పోటీల్లో సత్తా చాటారు. ఎస్జీఎఫ్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్–14, 17 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అండర్ 14 బాలుర విభాగంలో జి.ఎస్.వేదవ్యాస్(చిత్తూరు), ఎస్. మురారివెంకట్(అనంతపురం), కె.ఈశ్వరసాయి(అనంతపురం), ఎం.కృష్ణకార్తీక్(తూర్పుగోదావరి) సెమీస్‌కు చేరుకున్నారు. బాలికల విభాగంలో జె.నక్షత్ర, డి.యజ్ఞశ్రీ(అనంతపురం), డి.ఆశశ్రీ(ప్రకాశం), ఆర్.యశ్విత(కర్నూలు) సెమీస్‌లో ప్రవేశించారు. అండర్–17 బాలురలో పి.బాలప్రణయ్(విశాఖ), ఎ.త్రిలోక్(పశ్చిమ గోదావరి), కె.ఎస్ వెంకటప్రణీత్ (తూర్పుగోదావరి), టి.నిఖిల్ ప్రకాష్(కర్నూలు, బాలికల్లో అపర్ణ(విశాఖ), ఎస్.సౌమ్యశ్రీ(తూర్పుగోదావరి), సీహెచ్ భవితశ్రీ(పశ్చిమగోదావరి), బి.హర్షిత(విశాఖ) సెమీస్‌లోకి దూసుకెళ్లారు.

ఘనంగా చిరుధాన్యాల వేడుక



చిరుధాన్యాల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2013 వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, బోటని, బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ప్రదర్శనను కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ఈ పౌష్టికాహారాన్ని చిరుధాన్యాల ద్వారా తీసుకోవడం ఎంతో ఉత్తమన్నారు. అనంతరం మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో సంకలనం చేసిన చిరు ధాన్యాలు ఆరోగ్య సమాచారం పుస్తకాన్ని ప్రిన్సిపాల్, ప్రత్యేక ఆహ్వానితుడు మిల్లీ బాక్స్ యోగా విలేజ్ వ్యవస్థాపకుడు ప్రజ్ఞానంద్, లీ ఫార్మా లిమిటెడ్ న్యూట్రిషనిస్ట్ లావణ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ ఆవిష్కరించారు. రోజూ చిరు ధాన్యాలు తీసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మైక్రో బయాలజీ విభాగాధిపతి సిహెచ్.శాంతి దేవి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి చంద్రమౌళి, ఐక్యూ ఏ కో–ఆర్డినేటర్ రవిబాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి కె.రేఖ పాల్గొన్నారు.